క్లుప్తంగా

వెండి ఆకుల బహూకరణ



వెండి ఆకులను అందజేస్తున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడుబావి వీరాంజనేయ స్వామికి వెండి ఆకులను దాతలు జనార్దన్ గౌడు, జయమ్మ, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, మాళవిక, జగన్మోహన్, విరాట్ గౌడులు సోమవారం బహూకరించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ కొండల్లో వెలసిన శ్రీపాతమల్ల అభయ ఆంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసం అమావాస్యను పురస్కరించుకుని సోమవారం గుమ్మకొండతో పాటు వెంకటాపురం, కంబాలపాడు, కోయిలకొండ తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన దివ్యాంగుడు సన్నాకు దాతలు విరాళం అందజేశారు. షుగర్ కారణంగా సన్నాకు మోకాలి వరకు తొలగించారు. జైపూర్ కాలు అమర్చుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వర్లు తమ వంతు సాయంగా రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం చేశారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్ట భద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, మండల నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ఖాజా ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగభూషణంరెడ్డి, చలం రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రవీంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాల్మీకుల సంబరాలు

డోన్: స్థానిక సంస్థల కోటాలో ఇద్దరు వాల్మీకులకు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ స్థానం ప్రకటించడంతో డోన్‌లో సోమవారం వాల్మీకులు సంబరాలు చేసుకున్నారు. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన మంగమ్మ, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన డాక్టర్ మధుసూదన్‌ల పేర్లు ఖారారు చేయడంతో స్థానిక వాల్మీకి విగ్రహం ఎదుట బాణా సంచా పేల్చి సంబరా లు చేసుకున్నారు.తమ కులస్తులకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నా రని సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వా ల్మీకి సంఘం నాయకులు శీలం భాస్కర్ నాయుడు, పోస్టు ప్రసాద్, పూల శ్రీను, వెంకట్‌నాయుని పల్లె సర్పంచ్ శేఖర్, న్యాయవాదులు శివరామకృష్ణ, కృష్ణమూర్తి, ఎర్రిస్వామి, ఆర్ట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ పకడ్బందీగా అమలు చేయండి

బేతంచెర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన డీటీ సత్యదీప్, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలపై పలు సూచనలు ఇచ్చారు.

కేసు నమోదు

రుద్రవరం: మండలంలోని టీ.లింగదిన్నె, తువ్వపల్లె గ్రామాలకు చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి తువ్వపల్లెలో పల్లకీ వద్ద పూజలు చేయడం, పల్లకీ మోయడంపై ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. మాట మాట పెరిగి ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకొని దాడికి పాల్పడ్డారు. దీంతో టీ.లింగదిన్నెకు చెందిన గొడుగు పెద్ద లింగన్న, తువ్వపల్లె యువరాజ్ పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చెప్పారు.

పేదల గూడు చకచకా!

- జిల్లాలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- 64,880 గృహాల్లో 14,171 పూర్తి
- వివిధ దశల్లో 43,112 ఇళ్లు
- పేదల సొంతింటి కలకు అదనపు సాయం

బనగానపల్లె: పేదల పక్కా గృహాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇళ్ల స్థలాలతో గృహ నిర్మాణాలకు అవసరమైన సాయం అందజేస్తోంది. ఇప్పటి వరకు జిల్లాకు ప్రభుత్వం 64,880 గృహాలు మంజూరు చేసింది. ఇందులో 14,171 గృహాల నిర్మాణం పూర్తికాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. బీబీఎల్ స్థాయిలో 28,220 బీఎల్ స్థాయిలో 9,990, ఆర్ఎల్ లెవల్‌లో 2, 627, ఆర్‌సీ లెవల్‌లో 2, 075 ఉన్నాయి. ఈ గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 401.31 కోట్లు బిల్లుల రూపంలో చెల్లించింది. దీంతో పాటు లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందజేయడంతో పాటు ఇంటి నిర్మాణ సామగ్రిని మార్కెట్ ధర కంటే తక్కువకు సరఫరా చేస్తోంది.



వెంకటాపురం గ్రామంలో రూఫ్ లెవల్ వరకు తయారైన ఇల్లు

అదనపు సాయం

ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి విడతల వారీగా రూ.1.80 లక్షలు అందిస్తుంది. గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసేందుకు లబ్ధిదారులకు అదనపు సాయం అందజేసేందుకు చర్యలు చేపట్టింది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి అదనంగా రూ. 35 వేలు ఇస్తుంది. ఈ రుణాన్ని ఇంటి నిర్మాణ పనులకు లబ్ధిదారులు ఖర్చు చేయాలి. బనగానపల్లె నియోజకవర్గంలో మైనింగ్ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయం ఎంతో ఉపయోగపడుతున్నట్లు హౌసింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అర్హత ఉన్న ప్రతి మైనింగ్ కార్మిక కుటుంబానికి గృహ నిర్మాణ పథకంలో చేర్చి ఇంటి స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారు.

నియోజకవర్గాల వారీగా జిల్లాలో గృహాలు మంజూరు, నిర్మాణ వివరాలు ఇలా..

నియోజకవర్గం	మంజూరైన గృహాలు	వివిధ దశల్లో నిర్మాణం	పూర్తయినవి	మొదలుకానివి
ఆళ్లగడ్డ	13, 044	8,335	2,906	1,803
శ్రీశైలం	12, 280	8,838	2,774	668
పాణ్యం	1,679	954	346	379
నంద్యాల	5,656	2,552	2,956	148
బనగానపలె	11,179	7,311	1,414	2,454
డోన్	13,272	9,820	2,110	1342
నందికొట్కూరు	7,770	5,102	1,655	1,003



బత్తులూరుపాడు గ్రామంలో గృహ నిర్మాణ పథకం ద్వారా అందంగా తయారైన ఇల్లు

ఇంటిస్థలంతో పాటు గృహం మంజూరైంది



మాకు ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు గృహం మంజూరు చేసింది. సర్కారు సాయంతో ఇంటి నిర్మాణం కూడా ప్రారంభించాను. స్లాబ్‌లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి. జరిగిన పనుల వరకు బిల్లులు కూడా మంజూరయ్యాయి. ఇప్పుడు అదనపు సాయం అందజేస్తుండటంతో మాకు మరింత మేలు జరుగుతుంది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటాం.

– కుమ్మరి నరసమ్మ, ఇంటి లబ్ధిదారురాలు వెంకటాపురం, బనగానపల్లె మండలం

సొంతింటి కల నెరవేరింది



గతంలో సొంత ఇల్లు ఉండేదికాదు. ప్రభుత్వం గృహ నిర్మాణ పథకం కింద మాకు ఇల్లు మంజూరు చేసింది. అంతేకాకుండా ఆర్థిక సాయం కూడా అందజేయడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాము. ఇటీవలే కొత్త ఇంటిలో చేరాము. ఎన్నో ఏళ్ల తర్వాత మా సొంతింటి కల నెరవేరడంతో ఆనందంగా ఉంది.

– షాగినీ దేవి, లబ్ధిదారురాలు, బత్తులూరుపాడు బనగానపల్లె మండలం

ఉగాది నాటికి 50శాతం గృహ నిర్మాణాలు పూర్తి



మంజూరైన గృహాల నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రతి లబ్ధిదారుడు ఇంటిని నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో చాలా మంది ఉత్సాహంగా గృహాలు నిర్మించుకుంటున్నారు. నిర్మాణానికి అవసరమైన సాయం అందజేస్తున్నాం. ఉగాది నాటికి 50 శాతానికి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– కృష్ణారెడ్డి, హౌసింగ్ డీఈఈ, బనగానపల్లె

'భూపంపిణీ అడ్డుకున్న చరిత్ర జనార్దన్‌రెడ్డిదే'

కొలిమిగుండ్ల: భూపంపిణీని అడ్డుకున్న చరిత్ర టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డిదేనని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు నరసింహుడు ఆరోపించారు. బీసీ జనార్దన్‌రెడ్డి తీరుకు నిరసనగా సోమవారం ఎమ్మార్పీఎస్, వాల్మీకి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదలకు భూమి పంపిణీ చేస్తుంటే హైకోర్టుకు వెళ్లి జనార్దన్ రెడ్డి అడ్డుకోవడం తగదన్నారు. టీడీపీ హయాంలో అసైన్డ్‌మెంట్ కమిటీ లేకుండా టీడీపీ నాయకులు వందల ఎకరాలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం భూమి ఇస్తుంటే కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. హైకోర్టులో వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోకపోతే నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌కు వినతి పత్రం అందజేశారు. నిరసనలో నాయకులు పలుకూరు బాషా, సురేష్, సోమయ్య, నాగయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎంబీకేల అక్రమాలపై సభ్యుల ధ్వజం

- విచారణ చేపడతామన్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఎంబీకేలు అక్రమాలకు పాల్పడుతున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి తదితర పథకాల ద్వారా రుణాల మంజూరుకు ఒక్కో గ్రూపు నుంచి రూ. 2 వేల చొప్పున ఎంబీకేలు డబ్బు వసూలు చేస్తున్నారని ఎంపీటీ సభ్యులు షాజహాన్, పద్మావతితో పాటు పలు గ్రామాల సర్పంచులు సభలో ఆరోపించారు. ఆడిట్ పేరుతో మరో రూ.500 చొప్పున మండలంలో 900 పొదుపు గ్రూపులుండగా రూ.4.50 లక్షలు అక్రమంగా వసూలు చేశారని మండిపడ్డారు. ఈ విషయంపై విచారిస్తామని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా చెప్పగా.. రుణాల మంజూరుకు డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తమ దృష్టికి తేవాలని ఐకేపీ ఏరియా కోర్డినేటర్ గురుస్వామి కోరారు. మండలంలోని వెలగటూరులో గ్రామ పంచాయతీకి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఓ వ్యక్తి కనెక్షన్ ఏర్పాటు చేసుకుని ప్రైవేట్ మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తూ వ్యాపారంతో లక్షలాది రూపాయాలు గడిస్తున్నాడని సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. కమర్షియల్ వ్యాపారానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో పంచాయతీకి అదనపు భారం పడుతోందన్నారు. దీనిపై విచారణ జరుపుతామని ట్రాన్స్‌కో ఏఈ రామసుబ్రమణ్యం తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈలు హరీష్, ఖాన్, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఈఓపీఆర్‌డీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఏపీఓ శ్రీవిద్య, సర్పంచులు లోకేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీవీ శేషిరెడ్డి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి



కొత్తబురుజులో బండను లాగుతున్న వృషభాలు



పెట్నికోటలో బండను లాగుతున్న ఎద్దులు

సంబరం.. అంబరం

మహా శివరాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. ఎడ్ల బండ లాగుడు పోటీలు సోమవారం గ్రామాల్లో ఉత్సాహ భరిత వాతావరణాన్ని నెలకొల్పాయి. యువకుల ఆటల పోటీలతో పల్లెలు మురిసిపోయాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం విజేతలను బహుమతులతో సత్కరించారు.

పందికోన వృషభాలు భళా

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తబురుజు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు పళ్ల ఎడ్ల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన లవకుమార్ వృషభాలు విజేతగా నిలిచి రూ.20వేలు కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో కృష్ణగిరి మండలం ఆలంకొండ హేమంత్‌కుమార్, మూడో స్థానంలో ప్యాపిలి మండలం భరత్ కుమార్ ఎద్దులు నిలిచాయి.

వైఎస్సార్ జిల్లా ఎడ్ల జయకేతనం

కొలిమిగుండ్ల: పెట్నికోట గుండు మల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు కుర్రా వెంకటేష్ యాదవ్, పోతిరెడ్డిపల్లె మూలె సూరారెడ్డి ఎడ్ల సమాన దూరం బండను లాగి సయుక్త విజేతలకుగా నిలిచాయి. వైఎస్సార్ జిల్లా లింగాయపల్లెకు చెందిన పుల్లావుల సురేష్‌యాదవ్ ఎద్దు మూడవ, అనంతపురం జిల్లా యాడికి మండలం దైవాలమడుగు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ జిల్లా చిన్న కొమ్మెర్ల శ్రేయాన్స్‌రెడ్డి ఎద్దు నాల్గవ స్థానంలో నిలిచాయి.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీలో చిన్నకానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.40 వేలు కై వసం చేసుకున్నాయి. ద్వితీయ స్థానంలో ఊజర్ల పుల్లెం గోవిందు వృషభాలు (రూ.30 వేలు), మూడో స్థానంలో తురిమేకుల పల్లి తోట తిరుపాల్ రెడ్డి వృషభాలు (రూ.20 వేలు) నిలిచాయి.

కబడ్డీ విజేత ఓర్వకల్లు

బేతంచెర్ల: యంబాయిలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఓర్వకల్లు మండలం కొంతల పాడు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గుట్టపాడు ద్వితీయ, యంబాయి తృతీయ స్థానాలు కై వసం చేసుకోగా సిమెంట్ నగర్ జట్టు నాలుగవ స్థానంతో సరిపెట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో నూర్‌షావలి ఉరుసు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున వెలసిన నూర్‌షావలి దర్గాలో సోమవారం ఉరుసు వైభవంగా జరిగింది. మత సామరస్యానికి ప్రతీకగా శ్రీకృష్ణదేవరాయల కాలంతో ఒకవైపు శివాలయం, మరోవైపు నూర్‌షావలి దర్గా ఏర్పాటు చేశారు. ఏటా శివరాత్రి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం శివాలయంలో శివరాత్రి వేడుకలు, ఆది, సోమవారాల్లో నూర్‌షావలి దర్గాలో గంధం, ఉరుసు ఉత్సవాలు నిర్వహించారు. పట్టణం నుంచే గాక జోళదరాశి, వెలగటూరు, బిజనవేముల, సౌదరదిన్నె, అమడాల, పెద్దకొప్పెర్ల, గుళ్లదూర్తి, గుంజలపాడు తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.



నూర్‌షావలి దర్గా వద్ద భక్తులరద్దీ

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణ పరిధిలోని మల్లెంపల్లె ఫీడర్, హైవే ఫీడర్‌లకు మంగళవారం నుంచి 26వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంబాలపాడు రోడ్డు విస్తరణలో భాగంగా మల్లెంపల్లె ఫీడర్ల పరిధిలోని మల్లెంపల్లె, లక్షుంపల్లె, బొంతిరాళ్ల గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయిత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ రైతులకు తెల్లవారు జామున 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

డోన్ టౌన్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతసాధించాలని డోన్ ఉప విద్యాధికారి క్రిష్టఫర్ అన్నారు.పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. లెక్కల్లో అధికమార్కులు సాధించేందుకు సూచనలిచ్చారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆరోగ్యం విషయంపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

కాలనీల అభివృద్ధికి చర్యలు

బేతంచెర్ల: నగర పంచాయతీలోని కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. స్థానిక 5వ సచివాలయం పరిధిలో జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చలంరెడ్డి మాట్లాడుతూ ని సంజీవ గనగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఉన్నారు.





యాగంటి క్షేత్రంలో రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, భక్తుల మధ్య సాగుతున్న ఉమామహేశ్వరుల రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

బనగానపల్లె రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. ఉదయం ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ రుద్రాభిషేకము, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అలంకరించి రథంలో కొలువుంచారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల ప్రజలతో పాటు వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన స్వామి, అమ్మవార్లన దర్శించుకున్నారు.

అంగరంగ వైభవంగా మల్లన్న ఉత్సవం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె, అంబాపురం తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు రథోత్సవంలో పాల్గొని పులకించిపోయారు. నందికోలసేవ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు యమసాని జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, నాగ మోహన్, మధు మోహన్ రెడ్డి, గ్రూప్ ఆలయాల ఈఓ మద్దిలేటి తదితరులు భ్రమరాంబ మల్లికార్జున స్వామికి విశేషపూజలు నిర్వహించారు.

రామలింగేశ్వరా.. పాహిమాం!

డోన్ టౌన్: కొత్త బుగ్గ, పాత బుగ్గలలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి రథోత్సవం అశేష భక్త జనం మధ్య వైభవంగా సాగింది. శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో రథం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. రథంలో కొలువుంచి ప్రజల హర హర మహాదేవ శంభో శివ శంకర, ఓం నమో శివాయ నినాదాల మధ్య రథోత్సవం నిర్వహించారు.



ముచ్చట్లలో రథోత్సవానికి హాజరైన భక్తులు



కొత్త బుగ్గలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

కోలుకోలేక వలంటీర్ మృతి



సురేంద్ర(ఫైల్)

బేతంచెర్ల: రెండ్రోజుల క్రితం పాము కాటుకు గురైన వలంటీర్ సురేంద్ర కోలుకోలేక మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సిమెంట్ నగర్‌కు చెందిన మండ్ల వెంకట సుబ్బయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు(21) వలంటీర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డోన్ రూరల్: కర్ణాటక మద్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శేషయ్య తెలిపిన వివరాలు.. హోటల్స్‌లో పోలీసులు సోదాలు నిర్వహించారు. పాతబస్టాండ్ సమీపంలో ఉన్న శివశంకర్ హోటల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గమనించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన 46 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, శివశంకర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని నల్లగుట్ట వద్ద సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ నగేష్ తెలిపిన వివరాలు.. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. పేకాట ఆడుతున్న కొత్తపేటకు చెందిన ఈడిగ శివశంకర్‌గౌడ్, తాడూరు అరవ మాదయ్య, అరవ చిన్నమద్దిలేటి, అట్లు సోమశేఖర్‌రెడ్డి, చిగురుమాన్‌పేట బండి ప్రసాద్, ఎద్దుపెంట జి.ప్రసాద్‌రెడ్డిలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1,20,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ రహదారిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉద్యోగులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. వైఎస్సార్ జిల్లా కొండ సుంకేసుల గ్రామంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సంధ్యారాణి, ఉపాధ్యాయిని వజ్రావతి, ఇదే జిల్లా కల్వటాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న అమరావతి, నందప్రసాద్ విధులు ముగించుకుని ఆటోలో జమ్మలమడుగుకు బయలు దేరారు. సంజామల మండలం అక్కంపల్లె గ్రామ సమీపంలో కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో అమరావతికి చెయ్యి, నందప్రసాద్‌కు కాలు విరగగా మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.